వైభవంగా సుదర్శన నారసింహహోమం

మంత్రి శ్రీధర్‌బాబుకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, నవంబర్20 : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ జరిపారు. నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్యతిరు కల్యాణ తంతు చేపట్టారు. తెల్లవారు జామున సుప్రభాతం, తిరువారాధన జరిపి, ఆరగింపు చేశారు. స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపి, సహస్రనామార్చన, కుంకుమార్చన గావించారు. ముఖమండపంలో సువర్ణపుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారిని గరుఢవాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి వెండి మొక్కు జోడు సేవను ఊరేగించారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖాజానాకు రూ. 26,38,814ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు తెలిపారు.

అభిషేకంలో హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు

స్వామివారి నిజాభిషేకంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొని మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి ఆలయ సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. ఆయన వెంట కలెక్టర్ హనుమంతరావు ఉన్నారు.

సీఎం రేవంత్‌ది సంస్కారం లేని భాష : బీఆర్ఎస్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పూర్ణచందర్‌రాజు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 20 : సీఎం రేవంత్‌రెడ్డి సంస్కారం లేకుండా బజారు భాష మాట్లాడడం సిగ్గు చేటని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ప్రతికంఠం పూర్ణచందర్‌రాజు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేండ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. దేశంలోనే గొప్ప నాయకుడైన కేసీఆర్‌ను సీఎం నోటికివచ్చినట్లు తిట్టడంపై అన్ని వర్గాల ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. 6 గ్యారెంటీలను అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. మాయమాటలు చేబుతూ ప్రజా పాలన పేరుతో జనాన్ని మోసం చేస్తున్నారని మండి పడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, నాయకులు యాస ఇంద్రారెడ్డి, కొరె భిక్షపతి, గ్రామశాఖ అధ్యక్షుడు కొరె వెంకన్న, యాదగిరి, మధు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదు : బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను

మోత్కూర్, నవంబర్ 20 : తెలంగాణ చరిత్ర తెలియని సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదని పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్‌లో కేసీఆర్‌పై సీఎం చేసిన ఆరోపణలు అర్థ రహితమన్నారు. ఢిల్లీ పెద్దల ఎదుట మొకరిల్లి సీఎం పదవి తెచ్చుకున్న రేవంత్‌రెడ్డి.. ఊడిపోయే పదవి కోసం కేసీఆర్‌పై అవాకులు, చవాకులు పేలిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతకాక ఉద్యమ నేత కేసీఆర్‌ను తిట్టి మెప్పు పొందాలని చూస్తే ప్రజలు తిరగబడుతారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మర్రి అనిల్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ పురుగుల మల్లయ్య, నాయకులు విద్యాసాగర్, పరమేశ్, రమేశ్, ఫక్కీరు పాల్గొన్నారు.

బస్వాపురం రిజర్వాయర్‌కు 500 కోట్లు కేటాయించాలి : జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి అర్బన్, నవంబర్ 20 : బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల నిధులు కేటాయించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని రైతుబజార్ సమీపంలో రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయాలని పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్వాపుర్ రిజర్వాయర్ ప్రారంభించి 15 ఏండ్లు అవుతున్నా నేటికీ పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు రూ.లక్ష యాభై వేల కోట్లు ఎలా కేటాయించిందో, అలాగే రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కోసం రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, మంగ నర్సింహులు, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, మాయ కృష్ణ, దయ్యాల నర్సింహ, సిరిపంగ స్వామి, పోశెట్టి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, వెంకటేష్, పల్లెర్ల అంజయ్య పాల్గొన్నారు.

కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా సాగు నీరందించాలి : సీపీఎం

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 20 : కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా మండలంలోని పలుగ్రామాలకు సాగు నీరందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నరసింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య కోరారు. ఇంటింటికి సీపీఎం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బస్వాపురం గ్రామంలో రైతులతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాసాల వెంకటేశ్, మధ్యపురం బాల్ నరసింహ, మచ్చ భాస్కర్, నరాల చంద్రయ్య, ఉడత విష్ణు, రాసాల దేవేందర్, ఉడుత వెంకటేశ్ పాల్గొన్నారు.

సెంట్రింగ్ బాక్సుల చోరీకి యత్నం

- పట్టుబడిన ఇద్దరు దొంగలు, మరొకరు పరార్

చౌటుప్పల్, నవంబర్ 20 : పట్టణంలోని కేపీఆర్ వెంచర్‌లో బుధవారం సెంట్రింగ్ బాక్సుల చోరీకి యత్నిస్తున్న ఇద్దరు దుండగులు పట్టుబడగా మరొకరు పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రి ఊదరి నర్సింహ మూడ్రోజుల క్రితం సెంట్రింగ్ బాక్సులను స్థానిక కేపీఆర్ వెంచర్‌లోని వరగంటి భానుప్రకాశ్ ఇంటి నిర్మాణం కోసం వేశాడు. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఆటోలో వాటిని లోడ్ చేస్తున్నారు. ఇంటి యజమానితో పాటు మరో వ్యక్తి చోరీని గమనించి పట్టుకునేందుకు దగ్గరకు వెళ్లగా.. వారు పారిపోతున్నారు. వెంబడించి ఇద్దరిని పట్టుకోగా.. ఒకరు పరార్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఆటోతో పాటు పట్టుబడిన ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. వీరిని హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇబ్రహీం, మహ్మద్ ఆసీఫ్ అలీలుగా గుర్తించారు. వారిని విచారించగా పరారైన వ్యక్తి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో గల మారుతీనగర్‌కు చెందిన యాట బాబుగా చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కనకటి యాదగిరి తెలిపారు.

ఈనెల 23న విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్

భువనగిరి అర్బన్, నవంబర్ 20 : ఈనెల 23న విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పట్టణంలోని కిసాన్ నగర్‌లోగల విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం ఆవరణలో కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం-1 హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని డివిజనల్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వారు తమ ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలని సూచించారు. ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ జరుగుతుందని పేర్కొన్నారు. భువనగిరి డివిజన్ పరిధిలోని మండలాల విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హాస్టళ్లలో రాత్రి బస

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరికలెక్టరేట్, నవంబర్ 20 : సంక్షేమ హాస్టళ్లలో రాత్రి బస చేసి సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. కలెక్టరేట్ నుంచి బుధవారం సంక్షేమ అధికారులతో టెలిఫోన్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అన్నిరకాల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను ఈ వారం నుంచి తనిఖీలు చేస్తామని చెప్పారు. జిల్లాలోని సంక్షేమ అధికారులు వసతి గృహాల్లో పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, కిచెన్ గార్డెన్లను పెంపొందించాలని ఆదేశించారు. ఈ ఏడాది 10వ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వసతిగృహ సంక్షేమాధికారులు ఇన్‌చార్జిల నెపంతో బాధ్యతలు నిర్వర్తించకుండా తప్పించుకోవాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సంక్షేమాధికారులు మనసు పెట్టి పనిచేసి, పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడాలని కోరారు. నాణ్యమైన ఆహారం అందించాలని, పెంచిన చార్జీల ప్రకారం మెనూ అందించడంలో ఎలాంటి లోపాలు కనిపించొద్దన్నారు. విద్యార్థుల గదులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ, పక్క బట్టలు శుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ శాఖాధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

22న గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు : రాజేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న గాంధీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 20 : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 22న పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘ భవన్‌లో గాంధీ సుస్థిర విజ్ఞాన్ సదస్సు-2024 నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీజీ 100 ఏండ్ల క్రితం ప్రవచించిన అంశాలను ఐక్యారాజ్య సమితి 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గుర్తించిందన్నారు. సుస్థిత విద్య, ప్రకృతి వైద్యం, సేంద్రీయ వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, సుస్థిర ఇంధన వనరులు, పర్యావరణం, సుస్థిర క్రీడలు, మహిళా సాధికారికత, నీటి సంరక్షణ వంటి అంశాలపై సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజ్ఞానాన్ని స్టాల్స్ ద్వారా ప్రదర్శిస్తూ ఫొటోగ్యాలరీ, చరక, గ్రామ నిర్మాణ ఇంజినీర్లు, పురాతన, ఆధునిక వ్యవసాయ పనిముట్లు, ప్రకృతి వ్యవసాయాదారుల పంటల ప్రదర్శన, ఎద్దుగానుగ, మల్కం గేమ్, యోగా ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారుర. సుమారు 115 మంది ఉత్తమ రైతు దంపతులకు పుడమి మిత్ర అవార్డులు, వ్యవసాయాయ అనుబంధ రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న 35 మంది అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, జర్నలిస్టులు, ఎఫ్‌పీఓలకు కిసాన్ సేవారత్న అవార్డులను అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ సంస్థల ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గానాల ప్రభాకర్‌రెడ్డి, బుర్ర దశరథ గౌడ్, మెరుగు మధు, పావని, గాంధారి ప్రభాకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జిల్లా వ్యవసాయశాఖాధికారి గోపాల్

మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి గోపాల్

ఆలేరురూరల్, నవంబర్ 20 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాశాఖాధికారి గోపాల్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన 1పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి పద్మజ, ఏఓ శ్రీనివాస్, ఏఈఓ శివకుమార్ తదితరులున్నారు.

దివ్యాంగుల పింఛన్ పెంచే వరకు అందోళనలు

కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న వనం ఉపేందర్

రామన్నపేట, నవంబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ పెంచే వరకు ఈ నెల 20 నుంచి డిసెంబర్ 9వరకు రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఆందోళనలు చేపడుతామని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ అన్నారు. వెల్లంకి గ్రామంలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కరపత్రం ఆవిష్కరించి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ గురించి మాట్లాడక పోవడం.. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మంగ శ్రీను, తాటిపాముల జంగయ్య, పెండెం జానీ, మహేశ్, భిక్షమయ్య, ప్రసాద్, అంజమ్మ, నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

స్టడీ మెటీరియల్స్ అందిస్తున్న శైలెజ

యాదగిరిగుట్ట, నవంబర్ 20 : సహజ ఫౌండేషన్ నిర్వహకురాలు, ప్రముఖ సైకాలజిస్ట్ శైలెజ, కౌన్సిలర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం శానిటరి న్యాప్కిన్స్, స్టడీ మెటీరియల్స్ అందించారు. 300 మందికి మెటీరియళ్లతో పాటు కౌన్సిలింగ్ క్లాసులను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, సౌబేరా బేగం, ఉపాధ్యాయులు బాల భవాని, నాగలక్ష్మి, రజియాబేగం, సోమిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆహ్లాదం పంచుతున్న బఠాని పూలు

కప్రాయపల్లి-టి.రేపాక గ్రామాల మధ్య రోడ్డుకిరువైపులా విరబూసిన బఠాని పువ్వులు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 20 : మండలంలోని కప్రాయపల్లి నుంచి టి.రేపాకకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ వరకు బఠాని తీగ పరుచుకుంది. గులాబీ రంగులో విరబూసిన బఠాని పువ్వులు సువాసనను వెదజల్లడంతో పాటు వాహనదారులను ఆకర్షిస్తున్నాయి. వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

కేటీఆర్‌కు మద్దతు కోసం తరలి రావాలి : కిరణ్‌కుమార్

భువనగిరి అర్బన్, నవంబర్ 20: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు రైతులకు మద్దతు తెలిపేందుకు నేడు వెళ్తున్న సందర్భంగా భూదాన్‌పోచంపల్లి మండల సమీపంలోని కొత్తగూడెం క్రాస్‌రోడ్ వద్ద స్వాగతించి మద్దతు తెలిపేందుకు నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ.కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. భువనగిరి నియోజకవర్గంలోని నాయకులు రహదారి బంగ్లాకు ఉదయం 6.30 గంటల వరకు చేరుకోవాలని, అక్కడి నుంచి ఉదయం 7 గంటలకు బయల్దేరుతారని తెలిపారు. సీనియర్, జిల్లా ప్రజాప్రతినిధులు, కో-ఆప్షన్ సభ్యులు, బీసీ, ఎస్సీ, మైనార్టీ కమిటీలు, యువజన విభాగం నాయకులు, వార్డు కమిటీల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చెప్పారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకాలి : దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, నవంబర్ 20 : నేడు మాజీ మంత్రి కేటీఆర్ మహబూబాబాద్ పర్యటనకు చౌటుప్పల్ మీదుగా వెళ్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 గంటలకు స్థానిక బస్టాండ్ వద్ద ఆయన కాసేపు ఆగుతారని, స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొమ్మలరామారం, నవంబర్ 20 : మండలంలోని రంగాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో బుధవారం వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుస్తపురం గ్రామానికి చెందిన జిన్నా మల్లేశం(40) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటి లాగే బుధవారం ఉదయం చేపల విక్రయం కోసం తన టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా రంగాపురం వద్దకు రాగానే ఎదురుగా కారు వేగంగా వచ్చి ఢీ కొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు జిన్నా నిఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం : లింగం యాదవ్

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 20 : మండలంలోని జూలూరు పీఏసీఎస్‌లో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని మాజీ డైరెక్టర్లు చేసిన ఆరోపణలు అవాస్తమని చైర్మన్ అందెల లింగంయాదవ్ అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పు చేసినట్లు ఆధారాలుంటే ముక్కు నేలకు రాసి అవినీతి సొమ్మును వెంటనే జమ చేస్తానని వెల్లడించారు. సంఘంలో అవినీతికి పాల్పడితే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

పర్రెమైసమ్మ లగ్న పత్రిక ఆవిష్కరణ

ఆలేరు టౌన్,నవంబర్ 20 : పట్టణ కేంద్రంలోని కొలనుపాక రోడ్డులో గల పర్రెమైసమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ లగ్న పత్రికను బుధవారం పంబాల బాలనరసింహ, రాజు ఆలయ కమిటీ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. డిసెంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాధవ రెడ్డి, ఎలుగల మహేందర్, భిక్షపతి, యేలుగల కుమారస్వామి, శ్రీనివాస్, కొరుటూరి నరసింహులు ఉన్నారు.

సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దగ్ధం

ఆత్మకూరు(ఎం) : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

యాదగిరిగుట్ట, నవంబర్ 20 : వరంగల్ సభలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ పట్టణాధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంచులు మోసిన రేవంత్‌రెడ్డికి ప్రధానిని విమర్శించే స్థాయి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులున్నారు.

ఆలేరు టౌన్ : పట్టణ రైల్వే గేటు సమీపంలోని రహదారిపై సీఎం దిష్టిబొమ్మను బీజేపీ మండలాధ్యక్షుడు పూజారి కుమారస్వామి, పట్టణాధ్యక్షుడు నంద గంగేశ్ ఆధ్వర్యంలో దహనం చేశారు.

రాజాపేట/ఆత్మకూర్(ఎం) /తుర్కపల్లి/మోటకొండూరు/భువనగిరి అర్బన్ /వలిగొండ/భూదాన్‌పోచంపల్లి : రాజాపేట మండల కేంద్రంలో బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూర్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని ప్రధానరోడ్డుపై, తుర్కపల్లి మండల కేంద్రంలోని చౌరస్తాలో, మోటకొండూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, భువనగిరి పట్టణంలోని వినాయకచౌరస్తాలో, వలిగొండ మండల కేంద్రంలో భువనగిరి -చిట్యాల ప్రధాన రహదారిపై, భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రంలోని నేతాజీ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు.

వధూవరులకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల ఆశీర్వాదం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 20 : బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు కొమ్ము శ్యాం-వరలక్ష్మి వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి బుధవారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పార్టీ నియోజవర్గ మాజీ అధ్యక్షుడు చింతకింది కిరణ్, మండల యూత్ అధ్యక్షుడు కలుకూరి శ్రీకాంత్, నాయకులు ఎడ్ల లింగస్వామి ఉన్నారు.

పుస్తక పఠనంతో మంచిమార్గం

- అడిషనల్ కలెక్టర్ గంగాధర్

విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న ఏసీ కే.గంగాధర్

భువనగిరి అర్బన్, నవంబర్ 20 : విద్యార్థులు పుస్తక పఠనంతోనే మంచి మార్గంలో వెళ్లొచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ కే.గంగాధర్ అన్నారు. జిల్లా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుస్తకపఠనంపై ఎక్కువ సమయం కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి.మధుసూదన్‌రెడ్డి, పాఠకులు జంపాల అంజయ్య, మాటూరి బాలేశ్వర్, గ్రంథాలయ సిబ్బంది యాదగిరిస్వామి, జి.రాజ్యలక్ష్మి, అనిత, కావ్య, శ్రీను, లక్ష్మమ్మ, పాల్గొన్నారు.

సమాజంలో మానవీయత లోపిస్తుంది

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వృద్ధులకు మందులు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చౌటుప్పల్‌రూరల్, నవంబర్ 20 : ప్రస్తుతం సమాజంలో మానవీయత లోపిస్తుందని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామంలోని సాయి వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వర్కింగ్ జర్నలిస్టులకు బీమా పాలసీ పత్రాలను అందించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు దెబ్బటి అశోక్, జేవై శెట్టి, విద్యా సాగర్‌రెడ్డి, నారాయణ, అప్పారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కేజీబీవీల బలోపేతానికి కృషి చేయాలి : డీఈఓ


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కె. సత్యనారాయణ

మోత్కూరు, నవంబర్ 20 : కేజీబీవీల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ కె. సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని కేజీబీవీలో జిల్లా పరిధిలోని ఎస్ఓలతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, పరిశుభ్రమైన మెనూ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పురుగులు పట్టిన బియ్యం, కుళ్లిన కూరగాయలు, నాణ్యత లేని వంటలను వడ్డిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మెనూను ఏరోజుకారోజు పరిశీలించాలన్నారు. వంట మనుషుల నిర్లక్ష్యంతో శుభ్రత పాటించక పోతే ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. వంటలు రుచిగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అంతకు ముందు కేజీబీవీని పరిశీలించి, మెనూను పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీఓ రాధ, మోత్కూరు, అడ్డగూడూరు ఎంఇఓలు టి గోపాల్‌రెడ్డి, శ